గుంతల రోడ్డు.. ప్రజల అవస్థలు

- ప్రభావిత గ్రామంపై ఎన్టీపీసీ నిర్లక్ష్య ధోరణి
- కొత్త రోడ్డు నిర్మించాలని డిమాండ్


అధ్వానంగా ఐటీసీ నుంచి కుందనపల్లి మీదుగా అక్బర్‌నగర్ వెళ్లే రహదారి

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ హైవే కనెక్టివిటీ ఐటీసీ నుంచి కుందనపల్లి మీదుగా అక్బర్‌నగర్ వెళ్లే రహదారితో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పదేళ్ల క్రితం వేసిన తారురోడ్డు శిథిలావస్థకు చేరింది. రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు కుదుపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనాలు అదుపుతున్నాయి. ఇదే కాకుండా రహదారి మధ్యలో కుందనపల్లి గ్రామ శివారులో ఐదు రైల్వేలైన్లతో మూడు రైల్వేగేట్లు ఉండడం రాకపోకలకు మరీ అడ్డంకిగా మారింది. ఈ గుంతల రోడ్డు మీదుగా నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది కుందనపల్లి కేజీబీవీ, ఐటీసీ, హెచ్‌పీసీఎల్ డిపోల్లో పని చేసే కార్మికులు, ఇందిరమ్మ కాలనీ, మొగల్‌పహాడ్ నుంచి పంచాయతీ కార్యాలయం, రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అక్బర్‌నగర్‌లోని ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో భద్రతా చర్యల నిమిత్తం ఎన్టీపీసీకి చెందిన సెక్యూరిటీ వాహనాలు సైతం ఇదే రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యుత్ కేంద్రాల స్థాపనకు భూములు ధారాదత్తం చేసిన మొగల్‌పహాడ్‌లో సైతం అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు నానాకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా కొత్త రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు తమ ఇంటి ఆవరణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ కోరారు. పట్టణంలో జరుగుతున్న స్వచ్ఛత పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. వీధుల్లో ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వార్డు ఆఫీసర్లు సుధీర్, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

పెద్దపల్లిలో గోపూజ



పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ధర్మారం రోడ్‌లో గల బాలాంజనేయస్వామి ఆలయంలో గురువారం గోపూజ ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోవుకు పూజలు చేశారు. గోవుల సంతతిని పెంచేందుకు వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరముందని అఖిలభారత గోరక్ష సహ ప్రముఖ్ కేశవరాజు పిలుపునిచ్చారు. బొమ్మకంటి రవి, ఎన్‌డీ తివారీ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోదావరిఖని: ప్రశాంతమైన వాతావరణంలో గణేశ్ నవరాత్రులు జరుపుకోవాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం అన్ని మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతీఒక్కరు ఆన్‌లైన్ ద్వారా మంటపాల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ రమేశ్, మత పెద్దలు, గణేష్ మండపాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గోదావరిఖని టూటౌన్ పరిధిలో గురువారం పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ వినాయకులను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా ఓబీసీ ఐక్యత చాటాలి

ధర్మారం: రాజకీయ పార్టీలకు అతీతంగా ఓబీసీల ఐక్యత చాటాలని కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ కోరారు. మండల కేంద్రంలోని గౌతమిబుద్ధ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఓబీసీల పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని జన అధికార సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ నరహరి ఐదేళ్ల సుదీర్ఘ పరిశోధన ఫలితమే ఈ పుస్తకం అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలను గెలిపించాలని కోరారు. జన అధికార సమితి ప్రధాన సభ్యులు తీట్ల రమేశ్, కీర్త నాగార్జున, కన్నం తిరుపతి, సాయివేణి సతీశ్, ఇప్పనపల్లి సాంబయ్య, ఎలిగేటి తిరుపతి, మండల సభ్యులు మామిడిశెట్టి శ్రీనివాస్, గంధం మల్లయ్య, కొత్త నర్సింహులు, ఇప్పలపల్లి సురేందర్, ఒడ్నాల శంకరయ్య, అమరపెల్లి నారాయణ, పోసు దాసరి సంతోష్, ఆవుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా


మాట్లాడుతున్న మనాలిఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్‌లో గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మహిళా రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళలతో ముచ్చటించారు. పనికి తగిన వేతనం అందుతుందా, గ్రామాల్లో ఉపాధి పనులు ఏవిధంగా కొనసాగుతున్నాయి, కూలీ వేతనం గిట్టుబాటవుతుందా అని తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు

కొలనూర్ యువకుడికి డెంగీ

ఓదెల: మండలంలోని కొలనూర్‌కు చెందిన ఓ యువకుడికి డెంగీ సోకినట్లు డాక్టర్ శంజనేష్ గురువారం తెలిపారు. మూడురోజులుగా జ్వరంతో బాధపడుతున్న యువకుడు స్థానిక పీహెచ్‌సీకి రాగా పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చినట్లు డాక్టర్ పేర్కొన్నారు.

కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం సాధించిన వార్షిక లాభాలను ప్రకటించి అందులో 35శాతం కార్మికులకు వాటాగా ఇవ్వాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 సీహెచ్‌పీలో గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి, కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ స్కూల్ ద్వారా ఉచిత విద్య అందించాలని, గోదావరిఖనిలో సింగరేణి కార్పొరేట్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, కొత్తగనులు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలివ్వాలని కోరారు. సంస్థకు రావాల్సిన రూ.42వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వై.సారంగపాణి, రైతు రమేశ్, ఆరుకాల ప్రసాద్, రాజమహేందర్‌రెడ్డి, జబ్బర్‌లాల్, సంతోష్ పాల్గొన్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో ఇటీవల విధులు నిర్వహిస్తూ సామల రామ్మూర్తి అనే గ్రీజ్‌హెల్పర్ గుండెపోటుతో మృతి చెందాడు. కాగా అతని కుటుంబానికి గురువారం మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేశారు. ఓసీపీ–3 కృషి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మృతుని భార్య సామల లావణ్యకు రూ.15,36,639 విలువ గల చెక్కును అధికారులు, యూనియన్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ భారత్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ శ్యాంసన్, సంక్షేమాధికారులు సాయికృష్ణ, అజీజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


సమావేశం నిర్వహిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏలలో గుర్తింపు సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులతో గురువారం జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీఎం సుధాకర్ రావు తెలిపారు. ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం–3 ఏరియా జీఎం, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కొలిపాక నాగేశ్వరరావుతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు పలు అంశాలపై చర్చించారు. కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జీఎం పేర్కొన్నారు. స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు డి.తిరుపతిరావు, పరిపూర్ణచారి, ఏరియా ఇంజనీర్లు వై.వి.శేఖరబాబు, కె.యాదయ్య, ప్రాజెక్టు అధికారులు, విభాగాధిపతులు సి.జె.సురేఖ, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులతో నాలుగు రోజుల నుంచి స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్ నిర్వహించింది. విజయవాడకు చెందిన డాక్టర్ పి.సత్యనారాయణ (ఎన్‌సీఈఆర్‌టీ) రిప్రెజంటేషన్స్ సభ్యుడు మ్యాథమెటిక్స్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో 300మంది విద్యార్థులు లెక్కల్లోని సూత్రాలను ఉపయోగించుకొని గణితాన్ని సులభంగా ఎలా నేర్చుకోవాలో వారు తయారు చేసిన ప్రాజెక్టులతో వివరించారు. గురువారం నిర్వహించిన మ్యాథ్స్ వర్క్‌షాప్‌ను గోదావరిఖని ఏసీపీ రమేశ్ సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, విజయ ఆనంద్, అమరేందర్, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్, హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం షెడ్డుకు భూమిపూజ


మొక్క నాటుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని పాత 18 మెగావాట్ల పవర్‌హౌస్ సమీపంలోని దుర్గామాత దేవాలయం వద్ద అన్నదానం షెడ్డుకు సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ దంపతులు గురువారం భూమిపూజ చేశారు. అనంతరం సమీపంలోని పార్క్‌లో మొక్కలు నాటారు. జీఎం లలిత్‌కుమార్, అధికారులు ఆంజనేయప్రసాద్, రవీందర్‌రెడ్డి, ధనలక్ష్మిబాయి, చిలక శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

త్వరితగతిన సీఎంపీఎఫ్ చెల్లింపులు

గోదావరిఖని: సీఎంపీఎఫ్ చెల్లింపులు త్వరితగతిన చేసేలా కార్యాచరణ తీసుకున్నామని రీజినల్ కమిషనర్ కె.గోవర్ధన్ పేర్కొన్నారు. ఆర్జీ–2 అధికారులతో గురువారం జీఎం కార్యాలయంలో సమావేశమయ్యారు. అధికార ప్రతినిధి అరవింద్‌రావు, అధికారులు సాధన్, సాయికృష్ణ, అజీజ్, నరేశ్, సీఎంపీఎఫ్ అధికారులు రమేశ్‌కుమార్, బి.కమలేష్‌రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వైకుంఠ రథం, ఫ్రీజర్ కొనుగోలుకు విరాళాలు


విరాళం అందజేస్తున్న రైస్‌మిల్ యజమాని

కాల్వశ్రీరాంపూర్: మండలంలో అంతిమ యాత్రల్లో వాహన ఇబ్బందులు తొలగించేందుకు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ పిలుపు మేరకు చేపట్టిన వైకుంఠరథం, ఫ్రీజర్ కొనుగోలుకు దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతన్నాయి. స్థానిక రైస్ మిల్ యజమాని గోలి రమణయ్య గురువారం రూ.50వేల విరాళం ట్రస్ట్‌కు అందించారు. మాజీ సర్పంచులు పొన్నమనేని దేవేందర్‌రావు, మాదాసు సతీశ్, మాజీ ఎంపీటీసీలు, గూడెపు జనార్దన్ రెడ్డి, రావి సదానందం, పోశాల సదానందం, గూడెపు సాంబశివరెడ్డి, కె.కనుకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు ఎండీ మునీర్, కేతుపల్లి నర్సింహారెడ్డి, గాజుల మోహన్ రూ.10వేల చొప్పున ట్రస్ట్‌కు అందించారు. విరాళాలు అందించాలనుకునే దాతలు ట్రస్ట్ కన్వీనర్ మూల రమణారెడ్డి, కోకన్వీనర్ పులి కిషన్ రెడ్డికి అందించాలని కోరారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు రామిడి తిరుపతిరెడ్డి, సబ్బని రాజమల్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఆరెపల్లె రాజు, మాజీ కోఆప్షన్ సభ్యుడు కలీమొద్దీన్, మాజీ సర్పంచులు ఎం.సదానందం, పనాస మల్లయ్య, నాయకులు నారాయణ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లిలో ఆయిల్‌పాం సాగుపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎల్లంకి శ్రీనివాస్ 42 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్నాడని జిల్లా ఉద్యానవన అధికారి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయిల్‌పాం సాగుతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఏవో నాగార్జున, ఏఈవో ఈశ్వర్, హెచ్‌ఈవో రాము, తిరుమల ఆయిల్ కెమ్ ఇండియా ప్రయివేటు కంపెనీ సీఈవో కేశు కళ్యాణ్‌కర్, ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, కోర్డినేటర్ తిరుపతిరావు, మనోహర్, గొడ్డు స్వామి, పత్తి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వాడవాడలా ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో దోమల నివారణ కోసం కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వాడవాడలా రాత్రి ఫాగింగ్ చేశారు. గ్రామంలోని స్టేషన్ ఏరియా, ప్రధానవీధుల గుండా, గల్లీల్లో ఫాగింగ్ చేశారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

గోదావరిఖని: స్పీడుగా వెళ్తున్న ఆటో నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని గోదావరిఖని ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశేఖర్ స్పందించి ఆసుపత్రికి తరలించారు. స్థానిక మున్సిపల్‌చౌరస్తాలో పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రన్నింగ్ ఆటో నుంచి వ్యక్తి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న ఎస్‌ఐ హరిశేఖర్ స్పందించి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐని ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్‌రావు అభినందించారు.

సింగరేణి ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మధు, అజిత్, రాహుల్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, రమేశ్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రైతువేదికలో గురువారం మండల పరిధిలోని డీలర్లతో కలెక్టర్ కోయశ్రీ హర్ష వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి యూరియా సరఫరాపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఇటీవల కొన్ని మండలాల్లో యూరియా కృత్రిమ కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సొంత మండలంలోని రైతులకు మాత్రమే యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్, ఏఈవో హరీశ్, డీలర్లు శ్రీరామ ఫర్టిలైజర్స్, ప్రణయ్ మహేశ్, ధరణి ఫర్టిలైజర్స్, అంజనేయ ఫర్టిలైజర్స్, శ్రీవసుధ ఫర్టిలైజర్స్, అంతర్గాం, పొట్యాలలోని డీసీఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉద్యమకారులకు న్యాయం చేయాలి

మంథని: ప్రత్యేక రాష్ట్రసాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైందని, ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. సీఎంకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి గురువారం పోస్టుకార్డులే పంపినట్లు వారు తెలిపారు. ఉద్యమకారుల ఫోరం సభ్యులు గుర్రం దేవేందర్, దేవర్ల విజయకుమార్, ఎండీ సర్వర్, కోసినేని రమేశ్, కాజీపేట సాంబయ్య పాల్గొన్నారు.

• కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ హనుమాన్‌నగర్ వాసులకు గురువారం కాలనీ కాంగ్రెస్ నాయకులు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మార్క రాజు, దేవనపల్లి చక్రపాణి, డివిజన్‌వాసులు పాల్గొన్నారు.

• దహన సంస్కారాలకు సాయం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రైవేటు స్వీపరుగా పని చేస్తున్న నర్సయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. నర్సయ్య దహన సంస్కారాలకు ఆలయం నుంచి రూ.5వేలు, ఆలయ పునర్ నిర్మాణదాత నల్ల మనోహర్‌రెడ్డి రూ.5వేల మొత్తం రూ.10వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం, బెజ్జంకి రమేశ్, వెంకటరమణ, వజ్రారెడ్డి ఉన్నారు.

• శివాలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో శ్రావణమాసం మాస శివరాత్రిని పురస్కరించుకొని కందుకూరి పద్మ–ప్రకాశ్‌రావు (పెద్దన్న) దంపతులు స్వామివారికి పలు రకాల పండ్లతో రుద్రాభిషేకం చేశారు. ఆలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

• మార్కెట్ కమిటీకి బెంచీలు వితరణ

ధర్మారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు పతంజలి యోగా సమితి ప్రశిక్షకులు జంగిలి మంజుల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం నాలుగు బెంచీలు అందించారు. ధాన్యం విక్రయిస్తున్న సమయంలో రైతులు కూర్చునేందుకు వీలుగా ఉండేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, మార్కెట్ కార్యదర్శి సరోజ కోరడంతో నాలుగు బెంచీలు అందించారు.

• విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఓదెల: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదవాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. ఓదెల మోడల్‌స్కూలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

• మండలంలో జాతీయ గణాంక సర్వే

పాలకుర్తి: మండల పరిధిలోని జయ్యారం గ్రామంలో గురువారం ప్రజాస్థితిగతులపై జాతీయ గణాంక సర్వే నిర్వహించారు. సర్వే అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని స్థానికుల వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబంలో సభ్యుల సంఖ్య, వారి విద్యార్హతలు, ఉపాధి వివరాలతో పాటు వేతన వివరాలు నమోదు చేసుకున్నారు. పంచాయతీ సెక్రటరీ గంధ్ర సాయిచరణ్, కారోబార్ శంకరయ్య, అంగన్‌వాడీ టీచర్లు రజిత, శోభారాణి, ఆశావర్కర్ వడ్లకొండ పద్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

• సదస్సు విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 7న హైదరాబాద్ లో నిర్వహించనున్న సదస్సు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

• రెండు జేసీబీలు సీజ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామశివారు గుట్ట ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. గురువారం అక్రమ మట్టి తరలింపుకు సంబంధించి పక్కా సమాచారం అందుకున్న మైనింగ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని చూసి టిప్పర్లతో సహా జేసీబీ డ్రైవర్లు పారిపోయారు. అధికారులు అక్కడే ఉండి జేసీబీల యజమానులు, డ్రైవర్ల కోసం ఆరా తీశారు. చాలా సేపటికి వచ్చిన యజమానులు జేసీబీలను సీజ్ చేయకుండా నానా తంటాలు పడ్డారు. అయినా మైనింగ్ ఆర్‌ఐ వెంకటగిరి రెండు జేసీబీలను సీజ్ చేసి పెద్దపల్లి ఠాణాకు తరలించినట్టు అధికారులు తెలిపారు.

• ధర్నా విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు మహేశ్, జిల్లాశాఖ కార్యదర్శి రాజేశం, అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివ శరణం, పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

మంథని: ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని పోలీస్ క్యాంపులు ఎత్తివేయాలని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 24న వరంగల్ అంబేడ్కర్ భవన్‌లో జరిగే బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ స్తూపం వద్ద గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. వేదిక జిల్లా కోకన్వీనర్లు గుమ్మడి కొమురయ్య, రామిల్ల బాపు, ప్రజా సంఘాల నాయకులు పోరెడ్డి వెంకన్న, ఉద్యమకారుల ఫోరం నాయకులు గోగుల రాజిరెడ్డి, బీసీ నాయకులు ఆకుల రాజబాబు, దళిత నాయకులు కన్నూరి తిరుపతి, కన్నూరి రాజబాబు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో గురువారం మండల స్థాయి క్రీడలను తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు, ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్ ప్రారంభించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, హెచ్‌ఎంలు, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి బండి కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంత్, నరేశ్, మణిమాల, దుర్గాప్రసాద్, నజీమ్, నరేశ్ పాల్గొన్నారు.

అంతర్గాంలో..

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ జోన్, మండల స్థాయి కార్యదర్శి తుల శోభారాణి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. మండల విద్యాధికారి ఏకాంబరం, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌తో పాటు పలు పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదలొద్దు

మంథని: మంథని పురపాలక సంఘం పరిధిలోని పశువులను రోడ్లపైకి వదలొద్దని మున్సిపల్ కమిషనర్ వెంకన్న ఒక ప్రకటనలో ఆదేశించారు. పశువులను రోడ్లపై వదిలి పెట్టడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇంటి ఆవరణలో పశువులు ఉంచుకోవాలని, రోడ్లపైకి వదిలితే పశువులను గోశాలకు తరలించి జరిమానా విధిస్తామన్నారు.

నేడు స్వచ్ఛంద బంద్‌లో పాల్గొనాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మార్వాడీ వ్యాపారులు చర్యలతో ఇబ్బంది పడుతున్న వారంతా శుక్రవారం తలపెట్టిన బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. పెద్దపల్లిలో గురువారం ఆయన మాట్లాడారు. మార్వాడీ వ్యాపారుల తీరుకు నిరసనగా ఓయూ జేఏసీ బంద్ పిలుపు మేరకు జిల్లాలో శుక్రవారం బంద్ పాటిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫౌండేషన్ సహకారంతో మహిళకు కృత్రిమ కాలు

ముత్తారం: హైదరాబాద్‌లోని భగవాన్ మహావీర్ వికలాంగ్ సమస్థాపన సహకారంతో ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన పర్శ లక్ష్మికి కృత్రిమ కాలు పెట్టించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎడమ కాలు లేక ఇబ్బంది పడుతున్న లక్ష్మి ఆర్థిక పరిస్థితిని ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరహరి దృష్టికి ఫౌండేషన్ సభ్యుడు కీర్తి నాగార్జున తీసుకెళ్లగా కృత్రిమ కాలు పెట్టించారు. సాయం చేసిన ఫౌండేషన్ నిర్వాహకులకు లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలిగేడులో ఆధార్‌కేంద్రం ప్రారంభం

ఎలిగేడు: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆధార్ కేంద్రం ప్రారంభమైనట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఆధార్‌కార్డు అప్‌డేషన్, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ఆధార్ కేంద్రం శనివారం వరకు అందుబాటులో ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం 29 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని సిద్ధార్థ పాఠశాల విద్యార్థులకు గురువారం షీటీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ మహిళలు ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటీసులు లేకుండా కూల్చివేయడం అన్యాయం


మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

గోదావరిఖని: ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా షాపింగ్ భవనాలను కూల్చివేయడం చట్టవ్యతిరేకం, అన్యాయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని పోచమ్మ మైదానంలో కూల్చివేసిన ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించారు. బాధితులతో మాట్లాడి ఓదార్చారు. ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయాలతో వేలాది మంది చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఎవరైనా అడ్డుపడితే పోలీసులతో భయపెట్టిస్తున్నారని, సామగ్రి కూడా తీసుకునే సమయం కూడా వ్యాపారస్తులకు ఇవ్వలేదని ఆరోపించారు.